క్లుప్తంగా

నేడు ఏక్తా యాత్ర

గోల్కొండ: నేడు జూబ్లీ ఏక్తా యాత్ర నిర్వహిస్తున్నామని బీజేపీ నాయకురాలు డాక్టర్ పద్మ వీరపనేని తెలిపారు. శనివారం ఆమె షేక్‌పేట్ నాలా బస్టాప్ వద్ద గల శివాజీ విగ్రహం వద్ద మాట్లాడారు. చలో మిలేంగే పేరున షేక్‌పేట్ శివాజీ విగ్రహం నుంచి ఈ యాత్ర ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని ఆమె తెలిపారు. బీజేపీతోపాటు బీజేపీ వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు ఇందులో పాల్గొంటున్నారని ఆమె పేర్కొన్నారు.

ఆకట్టుకున్న గజల్ గానం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజ్‌గోపాల్

గన్‌ఫౌండ్రీ: తెలుగు గజల్స్ సాహిత్య చరిత్రలో రచయిత రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి నూతన ఒరవడిని సృష్టించారని పలువురు ప్రముఖులు కొనియాడారు. శనివారం రవీంద్రభారతిలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రాజా వాసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాహితీవేత్త రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి రచించిన తెలుగు గజల్ గాన లహరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూగర్భ శాఖ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ విడి రాజ్‌గోపాల్ మాట్లాడుతూ.. తెలుగు గజల్ చరిత్రలో మొట్టమొదటిసారి గజల్ గానం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఆమె రచించిన కైరవి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళారత్నా విక్కి కృష్ణ, గజ్జల్ కవి సూరారం శంకర్, కుసుమ పాల్గొన్నారు.

నేటి నుంచి టీటీడీ ఆలయ బ్రహ్మోత్సవాలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని టీటీడీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 19 (నేటి)నుంచి మార్చి 1వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని టీటీడీ లోకల్ అడ్వయిజరీ కమిటీ అధ్యక్షుడు భాస్కర్ రావు తెలిపారు. ఫిబ్రవరి 19న అంకురార్పణ, 20న ధ్వజారోహణ, 24న గరుడ వాహనసేవ, 27న రథోత్సవం, 28న చక్రస్నానం, మార్చి 1న పుష్పయాగం తదితర పూజలు జరుగుతాయన్నారు. వీటితోపాటు ప్రతిరోజూ స్వామివారి విశేష వాహన పూజలు ఉంటాయన్నారు. ఉత్సవాల కోసం ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, పూలమాలలతో అందంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న హోంగార్డు మృతి


దీపక్‌సింగ్ (ఫైల్)

బంజారాహిల్స్: బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతున్న బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ హోంగార్డు దీపక్ సింగ్ శనివారం మృతి చెందారు. ఈనెల 7న దీపక్ సింగ్ విధులు నిర్వహిస్తున్న క్రమంలో బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యాడు. సిబ్బంది అతడ్ని వెంటనే జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అతని చికిత్స కోసం పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది కలిసి రూ. 2 లక్షల ఆర్థిక సాయం అందించారు. కాగా పది రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దీపక్ సింగ్‌ను శుక్రవారం నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న అతడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఇదిలా ఉండగా, దీపక్ సింగ్ బ్లూకోల్ట్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. దాదాపు పదేళ్లకుపైగా ఫిలింనగర్ సెక్టార్‌లో పనిచేస్తున్న ఇతను ఆ ప్రాంతంలో అందరికీ సుపరిచితుడు. దీపక్ సింగ్ విషయాన్ని గుర్తించిన అపోలో ఆసుపత్రి యాజమాన్యం అతడి చికిత్సకు అయిన రూ.14 లక్షలను మాఫీ చేసింది. దీంతో అపోలో యాజమాన్యానికి పోలీసు అధికారులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో భవానికి గోల్డ్ మెడల్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కాళీమందిర్‌కు చెందిన మైలవరపు భవాని పరుగు పందెంలో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ నెల 16 నుంచి 17 వరకు హర్యానాలో నిర్వహించిన 4వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్–2023 పోటీల్లో ఆమె పాల్గొంది. 1500 మీటర్ల విభాగంలో ఆమె గోల్డ్ మెడల్ సాధించింది.

శివాలయం నిర్మాణానికి భూమి పూజ

బండ్లగూడ: మానవుడి మనుగడకు దైవ చింతన ఎంతో ముఖ్యమని కిస్మత్‌పూర్ శ్రీకృష్ణ దేవాలయం కమిటీ చైర్మన్ నీరుడు శేఖర్‌ముదిరాజ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ఆలయ ఆవరణలో నూతన శివాలయం నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులతో ఆలయం నిర్మిస్తామని, అందుకోసం ప్రజలు సైతం సహకారం అందించాలని ఆయన కోరారు.

హరహర మహాదేవ



కనుల పండువగా మహా శివరాత్రి వేడుకలు

శివనామ స్మరణలతో మార్మోగిన ఆలయాలు

- భక్తజనంతో పోటెత్తిన శివాలయాలు
- అర్చనలు, అభిషేకాలతో వెల్లివిరిసి ఆధ్యాత్మిక వాతావరణం

అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో శనివారం మహా శివరాత్రి వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. హరహర మహాదేవ.. శంభో శంకర.. ఓం నమఃశివాయ.. అంటూ భక్తుల శివనామ స్మరణలతో ఆలయాలు హోరెత్తాయి. తెల్లవారుఝాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకొని శివపార్వతులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణోత్సవం శివాలయాల్లో లింగోద్భావం, శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను చేశారు. – అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం


కాశిబుగ్గలో పూజలు చేస్తున్న మేయర్ విజయలక్ష్మి, బాబురావు తదితరులు


అభిషేకంలో పాల్గొన్న గోషామహల్ బీఆర్ఎస్ నాయకుడు పురుషోత్తమ్‌రావు


రుద్ర హోమం చేస్తున్న టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు దంపతులు


గోషామహల్ శివాలయంలో..


అభిషేకం చేస్తున్న సదానందంగుప్తా


శంకర్‌బాగ్‌లో..


పూజలు నిర్వహిస్తున్న టీటీడీ బోర్డు మెంబర్ మోహన్‌కుమార్


ఛత్రినాక లక్ష్మణేశ్వర స్వామి ఆలయంలో..


గోల్కొండలో..

శంకర్‌యాదవ్‌ను సన్మానించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


శంకర్‌యాదవ్‌ను సన్మానించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అఫ్జల్‌గంజ్: బీజేపీ జీహెచ్ఎంసీ పక్ష నేతగా ఎంపికైనా బేగంబజార్ కార్పొరేట్ గౌంటి శంకర్‌యాదవ్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి శాలువా, పూలమాలతో సన్మానించారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కార్పొరేటర్ శంకర్‌యాదవ్‌ను బీజేపీ కార్యకర్తలతో కలిసి శనివారం కిషన్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి శంకర్‌యాదవ్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు. గ్రేటర్ పరిధిలోని ప్రజా సమస్యలను కౌన్సిల్‌లో ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్యామ్‌యాదవ్, రాజు మహరాజ్, కట్ట రమేష్ ముదిరాజ్, మహేందర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

లిబర్టీ: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసి మధ్య తరగతి విద్యార్థులను ఆదుకోవాలని దళిత బహుజన విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇటిక్యాల గణేష్ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన సమాఖ్య కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, 2019 నుంచి 2022 వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేసి పేద విద్యార్థులను ఆదుకోవాలని కోరారు.

క్రీడాకారులకు సహకారం

మణికొండ: రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు సహకారం అందిస్తామని గంగిడి వెంకట్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. శనివారం కబడ్డీ క్రీడాకారులకు టీషర్టులు, జెర్సీలను శ్యాంసుందర్‌రెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహిస్తే మన రాష్ట్రం, దేశానికి గుర్తింపు తీసుకొస్తారన్నారు. అత్యధిక మందికి ప్రోత్సాహం లేకపోవడంతో క్రీడలను మధ్యలోనే ఆపేస్తున్నారని, అలాంటి వారికి తమ ట్రస్ట్ అండగా నిలుస్తుందన్నారు.

నేడు శివాజీ శోభాయాత్ర

బండ్లగూడ: శివాజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకొని హిమగిరినగర్ ఫేజ్–2లో ఆదివారం శోభాయాత్ర, బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు ఉదయ్ తెలిపారు. ఈ మేరకు బండ్లగూడ జాగీరు మేయర్ మహేందర్‌గౌడ్‌కు, కార్పొరేటర్ పద్మావతి పాండు, మాలతి నాగరాజుతో పాటు ముఖ్య నాయకులకు ఆహ్వానపత్రిక అందజేశారు. మనోజ్‌కుమార్, చంద్రశేఖర్, సునీల్, రాధాకృష్ణ, ప్రవీన్, గణేష్, రవి, సంతోష్ పాల్గొన్నారు.

కరపత్రం సాహిత్యంపై పరిశోధనకు డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ: కరపత్రం సాహిత్యంపై తొలిసారి పరిశోధన చేసిన వేల్పుకొండ వెంకటేష్‌కు ఓయూ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ప్రొ.సూర్యధనుంజయ్ పర్యవేక్షణలో కరపత్రం సాహిత్య ప్రపంచ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి జేఏసీ నాయకునిగా పనిచేసిన వెంకటేష్ బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

దళిత చైతన్య స్ఫూర్తి భాగ్యరెడ్డి వర్మ: జూలూరు గౌరీశంకర్

గన్‌ఫౌండ్రీ: దళితుల్లో చైతన్యానికి విద్యను ఆయుధంగా మలచిన దళిత చైతన్య స్ఫూర్తి భాగ్యరెడ్డి వర్మ అని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. శనివారం రవీంద్రభారతిలోని సాహిత్య అకాడమీ కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్. అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, భాగ్యరెడ్డి వర్మల స్ఫూర్తితో సీఎం కేసీఆర్ బడుగు బలహీన వర్గాల విద్యార్థుల కోసం పెద్ద ఎత్తున గురుకుల పాఠశాలలు నెలకొల్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యులు సీహెచ్. ఉపేందర్, ప్రొఫెసర్ కొండ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.


భాగ్యరెడ్డి వర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జూలూరు గౌరీశంకర్ తదితరులు

భాగ్యరెడ్డి వర్మ సమాజానికి స్ఫూర్తిదాయకం

సుల్తాన్‌బజార్: భాగ్యరెడ్డి వర్మ సమాజానికి స్ఫూర్తిదాయకమని ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూప రాణి అన్నారు. ఆదియందు సోషల్ లీక్స్ ఆధ్వర్యంలో శనివారం చాదర్‌ఘట్‌లోని ఆది హిందూ భవన్‌లో భాగ్యరెడ్డి వర్మ వర్ధంతి నిర్వహించారు. సెంటర్ ఫర్ మహాయాన బుద్ధిష్ట్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూప రాణి మాట్లాడుతూ.. భాగ్యరెడ్డి వర్మ పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ లీగ్ అధ్యక్షుడు రాహుల్, కార్యనిర్వాహక అధ్యక్షుడు పండరినాథ్, మేనేజింగ్ ట్రస్టీ జ్ఞాన ప్రకాష్, నరసింహ సత్యనారాయణ పాల్గొన్నారు.

అశోక్‌నగర్‌లో జోడో యాత్ర

చిలకలగూడ: అఖిలభారత కాంగ్రెస్ కమిటీ నేషనల్ కోఆర్డినేటర్ దీపక్‌జాన్ నేతృత్వంలో బౌద్ధనగర్ డివిజన్ అశోక్‌నగర్‌లో నిర్వహించిన హథ్ సే హథ్ జోడో యాత్రకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా దీపక్‌జాన్ మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్యాస్ ధర రూ.500, నిరుపేదల ఇళ్ల నిర్మాణానికి రూ. 5 లక్షలు, రైతులకు రూ. 2 లక్షల వ్యవసాయరుణం, పెట్రోలు, డీజిల్ ఇతర నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చారు. నియంతృత్వ పాలన సాగిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్‌లకు సరైన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

కళలను భావి తరాలకు అందించాలి

మణికొండ: మన సంస్కృతి, సాంప్రదాయాలు, పండుగల విశిష్టతలను కళలు చాటి చెబుతాయని, వాటిని భావి తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ అరవిందరావు అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, సెక్రటేరియట్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో గత రెండు రోజులుగా మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన శివోహం చిత్రలేఖన పోటీలు శనివారం ముగిశాయి. ముగింపు ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. శివుడి రూపాలను వర్ణించడం కళాకారులకే సాధ్యమన్నారు. నాట్యం, చిత్రలేఖనం ద్వారా శివత్వాన్ని మరింత వ్యాప్తి చేయవచ్చన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన 23 మంది చిత్రకారులకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మనోహర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

రూ.1800 విషయంలో గొడవ.. భర్త ఆత్మహత్య

జియాగూడ: రూ.1800 విషయంలో భార్యతో తలెత్తిన గొడవ భర్త ప్రాణాలను తీసుకునేలా చేసింది. కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. కార్వాన్‌లో నివాసం ఉంటున్న కిషన్(43) మేకలమండిలో కూలీ. ఇతనికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కుమార్తెకు ఇటీవల వివాహం అయ్యింది. ఈ నెల 15న మేకలమండి నుంచి కూలీ పని చేసుకుని ఇంటికి వచ్చిన కిషన్ డబ్బుల కోసం భార్యతో గొడవ పడ్డాడు. దాచిఉన్న రూ.1800 తీసుకుని వెళ్లాడు. ఇతనికి మద్యం తాగే అలవాటు ఉంది. సాయంత్రం ఇంటికి వచ్చిన కిషన్ భార్యకు రూ.800 తిరిగి ఇచ్చాడు. మిగతా రూ.1000 తెస్తానని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అర్ధరాత్రి వరకు భర్త ఇంటికి రాకపోవడంతో వాకాబు చేసినా సమాచారం లభించలేదు. గురువారం సాయంత్రం మూసీనదిలో చింతచెట్టుకు ఉరివేసుకున్నట్లు చుట్టుపక్కల వారు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఖదీర్ కుటుంబానికి మజ్లిస్ అండ: ఎమ్మెల్యే


మృతుడు ఖదీర్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మైనార్టీల పట్ల పోలీసులు క్రూరంగా, అత్యంత కిరాతకంగా ప్రవర్తిస్తున్నారని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. పోలీసుల తీవ్ర హింసల వల్లే తమ కుటుంబ పెద్ద మహ్మద్ అబ్దుల్ ఖదీర్ ప్రాణాలు కోల్పోయాడని మృతుడి కుటుంబసభ్యులు ఎమ్మెల్యే ముందు మొరపెట్టుకున్నారు. శనివారం ఎమ్మెల్యే మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి తాము వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెక్కాడితే కానీ డొక్కాడని ఖదీర్‌ను పట్టుకుని చేయని దొంగతనానికి ఒప్పుకుని తన కాగితాలపై సంతకం పెట్టాలంటూ పోలీసులు ఖదీర్‌ను విచక్షణారహితంగా కొట్టి, క్రూరంగా హింసించారన్నారు. పోలీసు ఉన్నతాధికారులు మాత్రం ఖదీర్‌పై చిత్రహింసలకు పాల్పడిన పోలీసులు నామమాత్రంగా బదిలీలు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. ఖదీర్ మృతికి బాధ్యులైన పోలీసులను ఉద్యోగాల నుంచి తొలగించి వారిపై హత్యా నేరాన్ని మోపుతూ కేసులు పెట్టాలన్నారు.

భాగ్యలక్ష్మి అమ్మవారికి పూజలు


పూజలు చేస్తున్న వెంకట్‌రావు, కేఎస్.ఆనంద్‌రావు

చార్మినార్: పాతబస్తీ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కేఎస్.ఆనంద్‌రావుతో కలిసి అంబర్‌పేట్ అదనపు డీసీపీ వెంకట్‌రావు చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ట్రస్టీ శశికళ ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి సత్కరించారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

గోల్కొండ: పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే వారు శాంతిని కాంక్షించేవారని ఆయన అన్నారు. మొహర్రం, రంజాన్, బక్రీద్, వినాయక చవితి, మహా శివరాత్రి పండగల్లో హిందూ–ముస్లింల స్నేహబంధం చూడముచ్చటగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు అక్బర్, ఆబిద్, వహీద్, మీర్జా ఎక్బాల్ అహ్మద్, ఎం.ఏబేగ్, షాన్వవాజ్ ఖాన్ తదితరులున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతర కృషి


కొత్త కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీసీపీ సాయి చైతన్య

చార్మినార్: ఇప్పటి వరకు డబీర్‌పురాలో ఉన్న మీర్‌చౌక్ ఏసీపీ కార్యాలయం పురానీహవేలీ డీసీపీ కార్యాలయం పక్కకు మారింది. ప్రస్తుతం మీర్‌చౌక్ ఏసీపీ డివిజన్ పరిధిలో మీర్‌చౌక్, రెయిన్‌బజార్, భవానీనగర్ పోలీసు స్టేషన్లున్నాయి. ఇప్పటి వరకు మీర్‌చౌక్‌లో ఉన్న మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ ఇక నుంచి ఛత్రినాక ఏసీపీ పరిధిలోకి వెళ్లగా.. డబీర్‌పురా పీఎస్ మలక్‌పేట్ ఏసీపీ పరిధిలోకి వెళ్లింది. డబీర్‌పురాకు మలక్‌పేట్ ఏసీపీ కార్యాలయం రానుంది. కొత్తగా ఏర్పాటు చేసిన మీర్‌చౌక్ ఏసీపీ కార్యాలయాన్ని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య ప్రారంభించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు: డీసీపీ..

పాతబస్తీలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నామని డీసీపీ సాయి చైతన్య అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించడానికి ప్రయత్నించే వారి పట్ల కఠినంగా వ్యవహరించనున్నామన్నారు. పోలీసు అధికారులు స్థానిక ప్రజల సహకారంతో ఆయా ప్రాంతాల్లో శాంతి సామరస్యానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మండలం అదనపు డీసీపీ ఆనంద్, మీర్‌చౌక్ ఏసీపీ దామోదర్‌రెడ్డి, మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, రెయిన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్, భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ అంజద్ అలీ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల ప్రదానం


సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న స్మితప్రజ్ఞ, డాక్టర్ ముజీబ్ హుస్సేని

అబిడ్స్: మెగా రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన వారికి కాంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీమ్ నిర్మూలన సంస్థ అధ్యక్షుడు స్నితాప్రజ్ఞ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ ఆధ్వర్యంలో జరిగిన మెగా రక్తదాన శిబిరంలో దాదాపు 700 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా స్నితప్రజ్ఞ వారి సర్టిఫికెట్లు ప్రదానం చేసి ప్రసంగించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆయన అన్నారు. డాక్టర్ ముజీబ్ హుస్సేని మానవతా ధృక్పథంతో ఒక సామాజిక కార్యక్రమం చేపట్టడం ఎంతో గొప్పదని అభినందించారు.

కేసరి కుస్తీ పోటీలు ప్రారంభం

గోల్కొండ: మల్లయోధులను ప్రోత్సహించేందుకే దశాబ్ద కాలంగా కుస్తీ పోటీలను నిర్వహిస్తున్నామని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. శనివారం గుడిమల్కాపూర్ తాళ్లగడ్డ స్టేడియంలో ఛత్రపతి శివాజీ కేసరి దేవర కరుణాకర్ మెమోరియల్ కుస్తీ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. హిందూ వాహిని ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలను ఆయన ప్రారంభించారు. జూనియర్, సీనియర్, సబ్ జూనియర్ కేటగిరిలలో పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని ప్రతినిధి గోవర్ధన్, చంద్రశేఖర్, దుర్గేష్, నాగేష్ పాల్గొన్నారు.


పోటీల్లో పాల్గొంటున్న వారితో దేవర శ్రీనివాస్ తదితరులు

దేశవ్యాప్తంగా బీఆర్ఎస్‌కు ఆదరణ: నందకిశోర్


మాట్లాడుతున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: సీఎం కేసీఆర్‌కు తెలంగాణ తరహాలోనే దేశవ్యాప్తంగా ఆదరణ లభిస్తుందని రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. గంగపుత్రా సమాజ్, జనతా జనార్దన్ సమితికి చెందిన దాదాపు 300 మంది శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నందకిశోర్ వ్యాస్ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వ ప్రగతి, అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అన్నివర్గాల వారు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గోషామహల్‌తో పాటు రాష్ట్ర నలుమూలలా బీఆర్ఎస్ విజయం సాధిస్తుందన్నారు. మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్‌గౌడ్, పరమేశ్వరీ సింగ్, సంతోష్‌గుప్తా, ఆల పురుషోత్తమ్, ఆనంద్‌సింగ్, అనిత, శంకర్‌సింగ్ జమేదార్, పప్పుమాత్రే, కోటి శైలేష్ కురుమ, శ్రీనుగౌడ్, ప్రదీప్‌రాజ్, రవికుమార్ పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో యాగశాల ప్రారంభం


యాగశాలను ప్రారంభిస్తున్న ముప్పిడి సీతారాంరెడ్డి

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా పూల్‌బాగ్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన యాగశాలను చాంద్రాయణగుట్ట నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి ముప్పిడి సీతారాంరెడ్డి శనివారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆలయ అర్చకులు కందాల మోహనాచార్యుల మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ కమిటీ చైర్మన్ బాశెట్టి లెనిన్ బాబు, దాతలు ప్రభాకర్, రాణి దంపతులు యాగశాలను రిబ్బన్ కట్ చేశారు. అనంతరం దివంగత బురుగు అల్వాలు జ్ఞాపకార్థం భార్య బురుగు చంద్రకళ, కుమారుడు ప్రభాకర్, రాణి దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో లాల్‌దర్వాజా ఆలయ ఫోర్‌మెన్ కమిటీ అధ్యక్షుడు శివకుమార్‌యాదవ్, ఈట నోముల శ్రీనివాస్, ధర్మకర్తలు సరాబు లక్ష్మణ్ గుప్తా, లింగాల యాదగిరి, కె.శారద, పట్లూరి వేంకటేశ్వర్ రావు, బి.మహేందర్ తదితరులు పాల్గొన్నారు.